
సాక్షి అనకాపల్లి

శుక్రవారం । 31 । జనవరి । 2025



వన మయూరం

8లో

అరకు చలి ఉత్సవాలకు మన్యం సిద్ధమైంది. ఈ వేడుకలు శుక్రవారం నుంచి మూడు రోజులు జరగనున్నాయి.



ఉక్కు మంత్రులకు వినతుల వెల్లువ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో కలపాలని కేంద్ర మంత్రి కుమారస్వామికి పోరాట కమిటీ నాయకులు వినతులు అందజేశారు.



పంచామృతాభిషేకం

డాబాగార్డెన్స్: విశాఖ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు.

న్యూస్‌రీల్

డిప్యూటీ తహసీల్దార్‌కు జైలు

- చెక్ బౌన్స్ కేసులో ఆరు నెలల కారాగార శిక్ష



వినయ్‌కుమార్

విశాఖ లీగల్/యలమంచిలి రూరల్: చెల్లని చెక్కు జారీ చేసిన యలమంచిలి డిప్యూటీ తహసీల్దార్ తురుమళ్ల హనుమాన్ వినయ్‌కుమార్‌కు ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ విశాఖలోని రెండో అదనపు ప్రత్యేక మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి గురువారం తీర్పునిచ్చారు. జైలు శిక్షతోపాటు రూ.9.05 లక్షల జరిమానా విధించారు. ఇందులో రూ.9 లక్షలు బాధితురాలికి చెల్లించాలని న్యాయమూర్తి ఆదేశించారు. బాధితురాలు పద్మావతి అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. వినయ్‌కుమార్ 2019 నవంబర్ 14వ తేదీన తెలగనీడి పద్మావతి దగ్గర రూ.12 లక్షలు అప్పుగా తీసుకున్నారు. అప్పు తీర్చే నిమిత్తం 2022 మార్చి 2వ తేదీన ఒక చెక్కు ఇచ్చారు. పద్మావతి ఆ చెక్కును తన బ్యాంక్ ఖాతాలో జమ చేయగా తగినన్ని నిధులు లేని కారణంగా చెక్కు నిరాదరణకు గురైంది. దీంతో ఆమె న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పునిచ్చారు.

ఆదివాసీ కూలీల వినూత్న నిరసన



పెదపేటలో గాంధీజీ చిత్రపటానికి చేతులు జోడించి నిరసన తెలుపుతున్న ఆదివాసీ కూలీలు

రోలుగుంట: తమకు పనులు కల్పించాలని కోరుతూ ఎం.పి.పట్నం పంచాయతీ శివారు పెదపేట గ్రామంలో ఉపాధి కూలీలు వినూత్నంగా నిరసన తెలిపారు. గురువారం గాంధీజీ వర్ధంతి సందర్భంగా మహాత్ముడి చిత్రపటానికి పూలమాల వేసి చేతులు జోడించి 'బాపూ... మాకు ఉపాధి కల్పించే బుద్ధి మా నేతలకు ఇవ్వు' అని వేడుకున్నారు. ఈ సందర్భంగా కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి జిల్లా కార్యదర్శి ఇ.చిరంజీవి మాట్లాడారు. అందరికీ ఉపాధి కల్పించాలన్న చట్టం ఇక్కడ అమలు కాలేదన్నారు. దీని వలన స్థానికులు పొరుగు జిల్లాలకు వలసపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ గ్రామంలో 25 కుటుంబాలకు జిరాయితీ భూములున్నాయి. 12 కుటుంబాలకు ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలున్నాయి. కానీ ఆ భూముల్లో పనిచేసుకుందాం అంటే అధికారులు పని కల్పించలేదని ఆరోపించారు. కలెక్టర్ కార్యాయం వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

మహాత్ముడిని మరిచారు



మాడుగుల గాంధీ పార్కులో బోసిపోయిన మహాత్ముడి విగ్రహం

మాడుగుల: మహాత్మగాంధీ వర్ధంతిని ఎవరూ పట్టించుకోకపోవడంతో మాడుగుల గాంధీ పార్కులో జాతిపిత విగ్రహం బోసిగా కనిపించింది. గాంధీజీ జయంతి, వర్ధంతి రోజుల్లో పూలదండలు వేసి మహాత్ముడిని స్మరించుకోవడం ఆనవాయితీ. కానీ గురువారం అధికారులు కాని, ప్రజాప్రతినిధులు కాని ఇటువైపు కన్నెత్తి కూడా చూడలేదు. పార్కుకు వచ్చిన సందర్శకులు ఈ దృశ్యం చూసి నొచ్చుకున్నారు.

లాడ్జిలో యువకుడి ఆత్మహత్య

- మృతుడు నర్సీపట్నం వాసిగా గుర్తింపు

మహబూబాబాద్ రూరల్: లాడ్జిలో ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఘటన తెలంగాణ రాష్ట్రం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం...ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలోని చాకలి కాలనీకి చెందిన పనస పతంజలి పవన్ ప్రేమ్‌కుమార్ (30) మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని శివప్రియ లాడ్జిలో బుధవారం గది అద్దెకు తీసుకున్నాడు. తను ఒకరోజు ఉండి వెళ్లిపోతానని నిర్వాహకులతో చెప్పి ఉదయం నుంచి రాత్రి వరకు ఆ గదిలోనే ఉండి నిద్రించాడు. గురువారం ఉదయం పనివాళ్లు అతడు ఉన్న గది శుభ్రం చేసేందుకు వెళ్లగా తలుపు ఎంతకీ తీయక పోవడంతో అనుమానం వచ్చి కిటికీలో నుంచి చూశారు. పవన్ ప్రేమ్‌కుమార్ ఫ్యాన్‌కు ఉరేసుకుని విగతజీవిగా కనిపించాడు. దీంతో లాడ్జి నిర్వాహకులు పోలీసులకు సమాచారం ఇవ్వగా టౌన్ ఎస్సై శివ ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. లాడ్జి నిర్వాహకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడు కుటుంబ కలహాల కారణంగానే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం.

జనసేనకు మిగులు భూములు



- రూ.4 కోట్ల విలువైన భూమి స్వాహా
- మిగులు భూమిగా రికార్డుల తారుమారు
- పన్నెండేళ్ల క్రితం అక్రమంగా ఆన్‌లైన్‌లో నమోదు
- ఇప్పుడు తాజాగా రిజిస్ట్రేషన్
- జనసేన నేత భూదాహం

నర్సీపట్నం ఆర్డీవో, తహసీల్దార్, పోలీసులు, సబ్‌రిజిస్ట్రార్‌కు బాధిత రైతుల ఫిర్యాదు

నక్కపల్లి : రాష్ట్రంలో టీడీపీ నేతల భూదాహం చూసి స్ఫూర్తి పొందారో లేక అవినీతి, అక్రమాల్లో తామూ ఏం తక్కువకాదని నిరూపించుకోవాలనుకున్నారో ఏమో జనసేన నేతలూ బరితెగించేస్తున్నారు. ప్రభుత్వ, మిగులు, వివాదాస్పద భూములపై కన్నేసి వాటిని స్వాహా చేసేస్తున్నారు. నక్కపల్లి మండలం, వేంపాడు గ్రామంలో జనసేన నాయకులు ఇదే పని మీద ఉన్నారు. ఇక్కడ వీరి భూ అక్రమాలు రైతులను భయకంపితులను చేస్తున్నాయి. మండలంలో పెద్ద ఎత్తున పరిశ్రమలు ఏర్పాటు కాబోతున్నాయంటూ జరుగుతున్న ప్రచారంతో వీరిప్పుడు తమ పలుకుబడిని, రెవెన్యూ శాఖలో తమకు సహకరించే సిబ్బందిని అడ్డుపెట్టుకుని అక్రమాలకు తెరలేపుతున్నారు. రెవెన్యూ రికార్డుల్లో మిగులు భూమి రికార్డులను తారుమారు చేసి అక్రమ రిజిస్ట్రేషన్లకు పావులు కదుపుతున్నారు. తద్వారా ఈ భూములను ఏపీఐఐసీకి విక్రయించి కోట్లాది రూపాయల పరిహారం దండుకునేందుకు కుట్రలు పన్నుతున్నారు. తమ సాగులో ఉన్న భూమిని రికార్డులు తారుమారు చేసి క్రయవిక్రయాలు జరిపారని.. పూర్వకాలం నుంచి ఇవి తమ ఆధీనంలోనే ఉంటూ సెటిల్మెంట్ ఫెయిర్ అడంగల్‌లో తమ పూర్వీకుల పేర్లే ఉన్నాయని.. వేంపాడు గ్రామ రైతులు కళ్లేపల్లి వెంకటపతిరాజు, కళ్లేపల్లి సీతారామరాజు, కళ్లేపల్లి సత్యనారాయణరాజు, కళ్లేపల్లి నాగరాజు, కళ్లేపల్లి రామరాజు తదితరులు నర్సీపట్నం ఆర్డీవో వీవీ రమణకు, తహసీల్దార్ నర్సింహమూర్తితో పాటు పోలీసులకు, సబ్ రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేయడంతో ఈ భూబాగోతం వెలుగుచూసింది. వివరాలివీ..



ఇటీవల నర్సీపట్నం ఆర్డీవోకు ఫిర్యాదు చేస్తున్న బాధిత రైతులు

చేతులు మారిన వివాదాస్పద భూమి..

వేంపాడు రెవెన్యూలో సర్వే నెం.276/1లో 7.30 ఎకరాల జిరాయితీ భూమి ఉంది. ఈ భూమి వేంపాడుకు చెందిన కళ్లేపల్లి కుటుంబీకులకు చెందింది. దాదాపు 60 ఏళ్ల నుంచి వీరి సాగులోనే ఉంది. ఉమ్మడి కుటుంబం కావడంతో తమకున్న భూమిని పంచుకుని అనుభవిస్తున్నారు. పంపకాల్లో ఏర్పడ్డ సమస్యల కారణంగా 7.30 ఎకరాల భూమిని వదిలేశారు. త్వరలో గ్రామంలో జరిగే రీసర్వేలో ఈ ఖాళీ భూమిని వారసుల పేర్ల మీద నమోదు చేయించుకుందామనే ఆలోచనలో ఉన్నారు. ఇంతలో ఈ భూమిని గత ఏడాది మే 30న దస్తావేజు నెంబరు 9493/24తో అమలాపురం ఉపసర్పంచ్, జనసేన సీనియర్ నాయకుడు గంటా నర్సింగరావు (అలియాస్ గబ్బర్‌సింగ్) కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు తాజాగా వెలుగులోనికి వచ్చింది. ఇదే గ్రామానికి చెందిన మడగల గోవిందు నుంచి ఈ భూమిని నర్సింగరావు కొనుగోలు చేసినట్లు రికార్డుల ద్వారా తెలుస్తోంది.

క్రయ విక్రయదార్లకు నోటీసులు

నక్కపల్లి: వేంపాడు రెవెన్యూ పరిధి సర్వే నెంబరు 276/1లో సుమారు 7.31 ఎకరాల భూముల్లో జరిగిన రిజిస్ట్రేషన్లకు సంబంధించి క్రయ విక్రయదార్లకు నోటీసులు జారీ చేసినట్లు తహసీల్దార్ ఆర్.నర్సింహమూర్తి తెలిపారు. తమ భూమి అన్యాక్రాంతమైనట్లు ఫిర్యాదు చేసిన కళ్లేపల్లి కుటుంబానికి చెందిన వెంకటపతిరాజు, నారాయణరాజు, సత్యనారాయణరాజులకు.. గత ఏడాది ఆ భూమిని కొన్న గంటా నర్సింగరావు, అమ్మిన మడగల గోవిందులకు నోటీసులు పంపించామన్నారు. తగు ఆధారాలు తీసుకుని వచ్చే నెల 1వ తేదీన తహసీల్దార్ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని నోటీసులు జారీ చేశామన్నారు. ఇరువర్గాల వద్ద ఉన్న ఆధారాలను పరిశీలించి, తదుపరి చర్యల నిమిత్తం ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తామని తహసీల్దార్ చెప్పారు.

రికార్డులు బాధితుల వైపే : తహసీల్దార్

సర్వే నెంబరు 276/1లో ఉన్న 7.30 ఎకరాల భూమి రెవెన్యూ రికార్డులైన సెటిల్మెంట్ ఫెయిర్ అడంగల్‌లో కళ్లేపల్లి కుటుంబీకుల పేరున నమోదై ఉంది. ఈ భూమిపై తమ వద్ద ఉన్న ఆధారాల ప్రకారం పూర్తి హక్కుదార్లు కళ్లేపల్లి కుటుంబీకులే. అక్రమ రిజిస్ట్రేషన్ల వ్యవహారంపై క్రయ విక్రయాలు జరిపిన మడగల గోవిందు, గంటా నర్సింగరావులకు నోటీసులు జారీ చేశాం. ఆధారాలు లేకపోతే అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేసి సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకుంటాం.

– నర్సింహమూర్తి, తహసీల్దార్, నర్సీపట్నం

చౌకగా వస్తోందనే కొన్నాను..

ఆన్‌లైన్‌లో మడగల గోవిందు పేరున ఉండడం.. చౌకగా వస్తుందనే ఉద్దేశంతో భూమిని కొనుగోలు చేశా. ఈ భూమి కళ్లేపల్లి కుటుంబీకులదన్న విషయం నాకు తెలీదు. ఈ భూమి గోవిందుకు ఎలా దఖలు పడిందన్న విషయాన్ని కూడా తెలుసుకునే ప్రయత్నం చేయలేదు.

– గంటా నర్సింగరావు, జనసేన సీనియర్ నేత

2012లో తప్పుడు రికార్డుల సృష్టి..

నిజానికి.. గంటా నర్సింగరావు, మడగల గోవిందులు 2012లో తమ భూమి రెవెన్యూ రికార్డులను తారుమారు చేసి ఆన్‌లైన్‌లో మిగులు భూమిగా నమోదుచేయించి ఇప్పుడు అక్రమ రిజిస్ట్రేషన్లకు పాల్పడ్డారంటూ బాధితులు ఆరోపించారు. సుమారు రూ.4 కోట్ల మార్కెట్ విలువగల ఈ భూమిని అక్రమంగా కొనుగోలు చేయడమే కాకుండా దీనిని రెండో విడతలో పరిశ్రమల కోసం ఏపీఐఐసీ వారికి విక్రయించేందుకు స్కెచ్ వేశారని వారు చెబుతున్నారు.

వెబ్‌ల్యాండ్ నిబంధనలకు విరుద్ధంగా..

ఇక ఈ వివాదాస్పద భూమి ఆన్‌లైన్ చేసే విషయంలో పలు అవకతవకలు చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది.

- ఈ భూమిని 2012 మార్చి 19న 832 ఖాతా నెంబరుతో మడగల గోవిందు పేరున ఆన్‌లైన్ చేశారు.
- తర్వాత 2024 సెప్టెంబరు 9న 1104 ఖాతా నెంబరుతో గంటా అప్పారావు (జనసేన నాయకుడు నర్సింగరావు తండ్రి) పేరుతో ఆన్‌లైన్ చేశారు. తిరిగి ఇదే రోజు ఖాతా నెంబరు 2454తో గంటా నర్సింగరావు పేరుతో ఆన్‌లైన్ చేశారు.
- ఒక సర్వే నెంబరులో ఒకే రోజున ఇద్దరు వ్యక్తులకు రెండు ఖాతా నెంబర్లతో ఆన్‌లైన్ చేయడం ఇక్కడ కొసమెరుపు. ఇది పూర్తిగా వెబ్‌ల్యాండ్ నిబంధనలకు విరుద్ధం. వెబ్‌ల్యాండ్‌లో ఇలా ఒకేరోజు రెండు ఖాతా నెంబర్లలో ఒకే భూమిని ఆన్‌లైన్ చేయడంపట్ల అధికారులు సైతం విస్తుబోతున్నారు.
- ఈ బాగోతం వెనుక కొందరు రెవెన్యూ సిబ్బంది ప్రమేయం కూడా ఉన్నట్లు తెలుస్తోంది.

నిబంధనలు ఏమి చెబుతున్నాయంటే..

- సాధారణంగా ఏదైనా భూమికి మ్యూటేషన్ చేసి ఆన్‌లైన్ చేయాలంటే పూర్వార్జితమైతే సంబంధిత పత్రాలు, వారసత్వ ధ్రువపత్రాలు, సర్వే సర్టిఫికెట్లు, పట్టాదారు పాసుపుస్తకాలు, అడంగల్ కాపీలు అందజేయాలి.
- కొనుగోలు చేసిన ఆస్తి అయితే సదరు భూమికి సంబంధించిన రిజిస్ట్రేషన్ దస్తావేజులు, ఈసీలు, సర్వే సర్టిఫికెట్లు సమర్పించాలి.
- వీఆర్‌ఓ, ఆర్‌ఐ, డిప్యూటీ తహసీల్దార్‌లు ఇవన్నీ పరిశీలించిన తర్వాతే మ్యూటేషన్ చేసి ఆన్‌లైన్ చేస్తారు.

కానీ.. అక్రమ రిజిస్ట్రేషన్ జరిగిన 7.30 ఎకరాల భూమికి ఎటువంటి పత్రాలు, దస్తావేజులు, సర్వే సర్టిఫికెట్లు లేకుండానే మ్యూటేషన్ చేసి ఆన్‌లైన్ చేసిపారేశారు. దీని ఆధారంగానే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ జరగడం, కొనుగోలు చేసిన వ్యక్తి పేరున ఆన్‌లైన్ అవ్వడం చకచకా జరిగిపోయాయి.

ఎన్నికల కోడ్ కూసినా..



ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నప్పటికీ నెహ్రూచౌక్‌లో తొలగించని ఫ్లెక్స్ బోర్డులు

- అనకాపల్లిలో రహదారికి ఇరువైపులా ఫ్లెక్స్ బోర్డులు

అనకాపల్లి: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు నోటిఫికేషన్ విడుదలై కోడ్ అమల్లోకి వచ్చినప్పటికీ పట్టణంలో అధికార యంత్రాంగానికి అదేమీ పట్టినట్టులేదు.. మెయిన్‌రోడ్డులో ఇరువైపులా ప్రజా ప్రతినిధులు, రాజకీయ నేతల ఫ్లెక్సీ బోర్డులు, కటౌట్లు దర్శనమిస్తున్నప్పటికీ చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. పట్టణ పరిధిలో సుంకరమెట్ట జంక్షన్ నుంచి శారదా బ్రిడ్జి, గుండా జంక్షన్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా పూడిమడక జాతీయ రహదారి వరకూ ఇరువైపులా బోర్డులు దర్శనమిస్తున్నాయి. ప్రధానంగా నెహ్రూచౌక్ జంక్షన్‌లో బస్టాప్ వద్ద ఇవి అడ్డంగా ఉండడంతో బస్సు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన కూడలి వద్ద ఎదురుగా ఎటువంటి వాహనాలు వస్తున్నాయో తెలియక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. జీవీఎంసీ కమిషనర్, ఎంపీడీవో వెంటనే స్పందించి ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌ను దృష్టిలో పెట్టుకుని బోర్డులను తొలగించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీ సమావేశానికి సర్వం సిద్ధం

- పార్లమెంటు పరిశీలకుడిగా నేడు ధర్మశ్రీ బాధ్యతల స్వీకారం

కశింకోట: కశింకోటలోని జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న సరోజిని విల్లాలో శుక్రవారం ఉదయం 10 గంటలకు వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ సమావేశం నిర్వహించడానికి సన్నాహాలు చేశారు. పార్టీ అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకుడిగా నియమితులైన చోడవరం మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ఈ సందర్భంగా పదవీ బాధ్యతలు చేపట్టనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. వైఎస్సార్‌సీపీ అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేపట్టారు. శాసనమండలి ప్రతిపక్ష నాయకుడు బొత్స సత్యనారాయణ, మాజీ మంత్రులు అంబటి రాంబాబు, గుడివాడ అమర్‌నాథ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు తదితరులకు స్వాగతం పలుకుతూ ఫ్లెక్సీలు కట్టారు. పార్టీ జెండాలను ప్రవేశ ద్వారం నుంచి సభా ప్రాంగణం వరకు వరుసగా చూడముచ్చటగా ఏర్పాటు చేశారు. సభా వేదికను అందంగా అలంకరించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చే పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తలు, నాయకులు, శ్రేణులు, అభిమానులు, పార్టీకి చెందిన స్థానిక ప్రజా ప్రతినిధులు, గతంలో నామినేటెడ్ పదవులు పొందిన వారు కూర్చోవడానికి అవసరమైన కుర్చీలను సమకూర్చి సభా ప్రాంగణాన్ని సిద్ధం చేశారు.



సభా వేదిక ముందు వైఎస్సార్ సీపీ ముఖ్య నేతలకు స్వాగతం పలుకుతూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, (ఇన్‌సెట్) ప్రవేశ ద్వారం

బ్రాండిక్స్ కార్మికుల మెరుపు సమ్మె

- పనివేళల పెంపుపై పెల్లుబికిన ఆగ్రహం
- గేట్లు తోసి బైఠాయించిన మహిళా కార్మికులు



పొద్దుపోయినా బ్రాండిక్స్ కంపెనీ వద్ద ఆందోళన కొనసాగిస్తున్న మహిళా కార్మికులు

అచ్యుతాపురం: బ్రాండిక్స్ కార్మికులు కదం తొక్కారు. యాజమాన్యంపై తిరగబడ్డారు. ఎన్నడూ లేనిది మెరుపు సమ్మెకు దిగారు. ఏ, బీ షిఫ్టులలో పనిచేసే మహిళా కార్మికులకు పనివేళలను మరో అరగంట పెంచటమే తాజా ఉద్యమానికి కారణం అయ్యింది. ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి షిఫ్టుకు అరగంట చొప్పున అదనంగా పనిచేయాలని యాజమాన్యం కొద్ది రోజుల క్రితం సూచించింది. అయితే సుదూర ప్రాంతాల నుంచి వచ్చే మహిళా కార్మికులు వారి కుటుంబాల ఆలనా పాలన వదిలేసి రాకపోకలు, పనివేళలను కలుపుకొని సుమారు 10 గంటలకు పైగా వెచ్చించాల్సి వస్తోంది. ఈ క్రమంలో షిఫ్టుకు అదనంగా మరో అరగంట పెంచాలని యాజమాన్యం నిర్ణయించి, ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి అమలు చేస్తున్నట్లు ప్రకటించడంతో పరిస్థితి మరింత జటిలంగా మారింది. కార్మికులు వ్యతిరేకించినప్పటికీ యాజమాన్యం కాస్త నియంతృత్వ ధోరణి ప్రదర్శించడంతో ఒకవైపు సీఐటీయూ నేతలు రంగంలోకి దిగడం, మరోవైపు కార్మికులు మెరుపు నిరసనకు దిగడంతో బ్రాండిక్స్ పరిసరాల్లో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. సీఐటీయూ నేతలు ఆర్ శంకర్‌రావు, ఆర్.రాము, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కె.లోకనాథం, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వరలక్ష్మి తదితరులు బ్రాండిక్స్ కార్మికుల సమ్మెకు మద్దతు పలికారు. విధులు నిర్వహిస్తున్న బ్రాండిక్స్ కార్మికులు గేట్లను తోసుకొని బైఠాయించి నినదించారు. పనివేళల పెంపు వల్ల కలిగే ఇబ్బందులను వివరించారు. కనీస వేతనాలు పెంచకపోగా, టార్గెట్లు ఎక్కువ చేస్తున్నారని మహిళా కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. అర్ధరాత్రి దాటినా వారు ఆందోళన కొనసాగించారు. పెంచిన పనివేళలకు అంగీకరిస్తున్నట్టు లోపల సి షిఫ్టు కార్మికులతో యాజమాన్యం సంతకాలు చేయించుకున్నట్టు సమాచారం.

దళారుల మాటలకు రైతులు మోసపోవద్దు

- తేమ శాతం 17 కన్నా తక్కువున్నా ధాన్యం తీసుకుంటాం
- సివిల్ సప్లైస్ అధికారి జయంతి విజ్ఞప్తి

సాక్షి, అనకాపల్లి: రైతులు దళారులను నమ్మి తక్కువ ధరకే తమ ధాన్యాన్ని అమ్మి మోసపోవద్దని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి పి.జయంతి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వానికి ధాన్యం అమ్మాలనుకునే రైతులు మీ దగ్గరలో ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను సంప్రదించాలని గురువారం ఆమె మీడియాకి తెలిపారు. ధాన్యం ముక్కిపోయాయని, తక్కువ ధరకు కొనుగోలు చేయాలని దళారులు ఒత్తిడి చేసినా ఎవరూ అమ్మవద్దన్నారు. ధాన్యంలో తేమ శాతం 17 కన్నా తక్కువగా ఉంటే ఆరబెట్టి తీసుకురావాలని, ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తీసుకుంటామని తెలిపారు. జిల్లాలో 72 కేంద్రాల ద్వారా ప్రొక్యూర్‌మెంట్ ప్రారంభమయిందన్నారు. ధాన్యం గ్రేడ్ 'ఎ' రకం క్వింటాకి రూ.2,320, సాధారణ రకం క్వింటాకి రూ.2,300 ఇస్తున్నట్లు తెలిపారు.

3 నుంచి నామినేషన్ల స్వీకరణ

- 27న పోలింగ్, మార్చి 3న లెక్కింపు
- ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు పకడ్బందీ ఏర్పాట్లు
- కలెక్టర్, ఆర్వో హరేంధిరప్రసాద్ వెల్లడి



మాట్లాడుతున్న విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, చిత్రంలో డీసీపీ అజిత

మహారాణిపేట: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఫిబ్రవరి 27వ తేదీ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరగనుందని, ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను అధికార యంత్రాంగం మొదలు పెట్టిందని విశాఖ జిల్లా కలెక్టర్, రిటర్నింగ్ అధికారి ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. ఎన్నికల సంఘం వెలువరించిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 29వ తేదీ నుంచే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిందన్నారు. 24 గంటల్లో అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో, పబ్లిక్ ప్రాంతాల్లో రాజకీయపరమైన పోస్టర్లు, ఫొటోలు తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. కలెక్టరేట్‌లో గురువారం డీసీపీ అజిత, జిల్లా రెవెన్యూ అధికారి, సహాయక రిటర్నింగ్ అధికారి బీహెచ్ భవానీ శంకర్‌లతో కలిసి విలేకరులతో మాట్లాడారు.

షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి 3న నోటిఫికేషన్ జారీ అవుతుందని, ఆ రోజు నుంచి అన్ని ప్రభుత్వ పని దినాల్లో ఉదయం 11 నుంచి సాయంత్రం 3 గంటల వరకు కలెక్టర్ కార్యాలయాల్లో నామినేషన్లు స్వీకరిస్తారని ఆర్వో హరేంధిరప్రసాద్ తెలిపారు. 10వ తేదీ సాయంత్రం 3 గంటలతో నామినేషన్ల ప్రక్రియ ముగుస్తుందని, 11న పరిశీలన, 13న ఉపసంహరణ ప్రక్రియ ఉంటుందన్నారు. 27న పోలింగ్, మార్చి 3న కౌంటింగ్ ప్రారంభమవుతుందన్నారు. 8వ తేదీతో ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందని కలెక్టర్ వివరించారు. 2024 డిసెంబర్ 30న వెలువరించిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ తుది ఓటర్ల జాబితా ప్రకారం ఆరు జిల్లాల పరిధిలో 21,555 మంది ఓటర్లు ఉన్నారని కలెక్టర్ తెలిపారు. వీరిలో పురుష ఓటర్లు 12,948, మహిళా ఓటర్లు 8,607 మంది ఉన్నారని పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర పరిధిలో 123 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు.

క్లుప్తంగా

బీచ్ వాలీబాల్ పోటీలకు రిఫరీగా శ్రీనివాసరావు



తుమ్మపాల : పట్టణానికి చెందిన జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు బీశెట్టి శ్రీనివాసరావు జాతీయ బీచ్ వాలీబాల్ పోటీలకు రిఫరీగా నియమితులయ్యారు. ఈనెల 28 నుండి ఫిబ్రవరి 14 వరకు ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని రిషికేష్ వద్ద ఉన్న శివపురిలో జరిగే 38వ జాతీయ స్త్రీ, పురుషుల బీచ్ వాలీబాల్ పోటీలకు ఆయనను రిఫరీగా నియమించడం పట్ల వాలీబాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విశాఖ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే పీవీజీఆర్ నాయుడు (గణబాబు), ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, కార్యదర్శి భగవాన్ దాస్, జార్జ్ క్లబ్ సోదర సంక్షేమ సంఘం అభినందనలు తెలిపారు.

నేటి జాబ్‌మేళా రద్దు

అనకాపల్లి : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 31న దేవరాపల్లి ప్రభుత్వ హైస్కూల్లో నిర్వహించే మేగా జాబ్‌మేళాను ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా రద్దు చేయడం జరిగిందని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎస్.గోవిందరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోడ్ ముగింపు అనంతరం ప్రభుత్వ ఆదేశాలు మేరకు నిరుద్యోగ యువతీ యువకులకు జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందన్నారు.

హైదరాబాద్‌లో 7న 'లక్ష డప్పులు -వేల గొంతులు'



కేక్ కట్ చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

తుమ్మపాల: హైదరాబాద్‌లో వచ్చే నెల 7న జరగబోయే లక్ష డప్పులు -వేల గొంతులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు యలక మల్లిబాబు మాదిగ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంటు కట్టుమూరి మంగరాజు పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ పురస్కారం ప్రకటించడంతో పట్టణంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదిగల ముద్దుబిడ్డ మంద కృష్ణ మాదిగ ఎమ్మార్పీఎస్ ద్వారా 30 ఏళ్ల పోరాటాల ఫలితంగా పద్మశ్రీ పురస్కారం వరించిందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు ఎమ్మార్పీస్, ఎంఎస్పీ, ఎంఎస్ఎఫ్, ఎంఎంఎస్ సంఘాల ఆధ్వర్యంలో ఫిబ్రవరి 7న లక్ష డప్పులు – వేల గొంతులు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి కొల్లి చిన్నఅప్పారావుమాదిగ, జిల్లా ప్రధాన కార్యదర్శి కాకినాడ కనకేశ్వరరావు, ఎంఎస్ఎఫ్ సీనియర్ నాయకులు కె.వెంకట్రావు మాస్టారు, మరికొంత మంది నాయకులు సీనియర్ నాయకులు కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గొట్టివాడ రవికుమార్ మాదిగ, పెట్ల మహాలక్ష్మినాయుడు, ఏడిది మహాలక్ష్మి, సిహెచ్ అప్పారావు, కే.నాగేశ్వరరావు,పెట్ల నాగేశ్వరరావు, నాగరాజు పాల్గొన్నారు.

● చలి ఉత్సాహం

ముస్తాబైన వన మయూరం



ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటుచేసిన జెయింట్ వీల్

ప్రకృతి అందాలకు నిలయమైన ఆంధ్రా ఊటీ అరకులోయ చలి ఉత్సవాలకు సిద్ధమైంది. నేటి నుంచి మూడు రోజులపాటు జరిగే ఉత్సవాల్లో గిరిజన వంటకాలు, వివిధ రాష్ట్రాల గిరిజన కళాకారుల నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.



సాక్షి, పాడేరు/అరకులోయ టౌన్: అందాల అరకులోయ చలి ఉత్సవాలకు ముస్తాబయ్యింది.శుక్రవారం నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు మూడు రోజులపాటు అరకు చలి ఉత్సవాలకు పాడేరు ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇందుకు సంబంధించి స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరుగుతున్న ఉత్సవ ఏర్పాట్లను గురువారం కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ ఎంజే అభిషేక్ గైడ్, పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, ఏఎస్పీ ధీరజ్‌లతో కలిసి గురువారం పరిశీలించారు. తురాయిగుడ కొండ సమీపంలోని హెలీ రైడ్‌లో కలెక్టర్‌తోపాటు అధికారులు పాల్గొని విహరించి, అరకు అందాలను తిలకించారు. ఉత్సవాలకు సంబంధించి ఏర్పాట్లు చివరి దశకు చేరుకున్నాయని కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. హెలీరైడ్‌లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఉత్సవం నిర్వహించే డిగ్రీ కళాశాల మైదానం, పద్మాపురం ఉద్యానవనం, హెలీ రైడ్ ప్రాంతంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ట్యాంక్లతో నీటి సరఫరా చేస్తున్నామన్నారు. ఫైర్ ఇంజన్, అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచామన్నారు.

హెలీరైడ్‌కు 150 మంది బుకింగ్

హెలీరైడ్ కోసం ఆన్‌లైన్‌లో 150 మంది బుక్ చేసుకున్నారని కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. ఆన్‌లైన్‌లో హెలీ రైడ్‌కు రూ. 3,500, స్పాట్ బుకింగ్‌రూ.4వేలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. హెలీరైడ్‌లో విహరిస్తే అరకు అందాలు అద్భుతంగా కనిపించాయన్నారు.

నోరూరించనున్న గిరిజన వంటకాలు

ఉత్సవాలు మూడు రోజులపాటు గిరిజన వంటకాలు నోరూరించనున్నాయి. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చిరి ధాన్యాలతో తయారు చేసిన వంటకాలను ప్రదర్శిస్తారు. వీటిలో రాగి పిండితో తయారు చేసిన అంబలి (రాగి జావ), తోఫ (రాగి సంగటి), సామ, కొర్ర బియ్యంతో అన్నం, రాజ్‌మా, కందులు, బొబ్బర్లు (అలసందలు, తదితర గిరిజన వ్యవసాయ ఉత్పత్తులతో తయారు చేసిన వంటకాలు ప్రదర్శనలో ఉంచుతారు.

ప్రత్యేక ఆకర్షణగా పుష్పాలంకరణ

పద్మాపురం ఉద్యానవనంలో ఏర్పాటుచేస్తున్న ఫ్లవర్ షో ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ఇందుకు ప్రత్యేకంగా పుష్పాలను రప్పించారు.



హెలీ రైడ్‌కు బయలుదేరుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్, జిల్లా అధికారులు

ఉత్సవాల డైరీ

31వ తేదీ: ఉదయం 7.30 నుంచి 10 గంటల వరకు పద్మాపురం గార్డెన్ నుంచి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధాన వేదిక వరకు ఐదు కిలోమీటర్ల మేరకు అరకు మారథాన్

- 11గంటలకు పద్మాపురం గార్డెన్‌లో ఫ్లవర్ షో ప్రారంభం
- మధ్యాహ్నం 1గంటకు 25 స్టాళ్లలో గిరిజన వంటకాల ఫుడ్ కోర్టు ప్రారంభం
- 3గంటలకు పద్మాపురం గార్డెన్ నుంచి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వేదిక వరకు కార్నివల్
- సాయంత్రం 5గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు. పలు రాష్ట్రాల గిరిజన కళాకారుల నృత్యాలు

ఫిబ్రవరి 1వ తేదీ: బొర్రాగుహల నుంచి అరకు డిగ్రీ కళాశాల వేదిక వరకు ఉదయం 7గంటల నుంచి ఉదయం 11 గంటల వరకు సైక్లింగ్

- 11గంటలకు అరకు మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్లాంటేషన్ డ్రైవ్
- మధ్యాహ్నం 12 గంటలకు డిగ్రీ కళాశాల ప్రధాన వేదిక వద్ద
- 2గంటలకు అరకులోయ కాఫీ హౌస్‌లో కాఫీ రుచుల టేస్టింగ్
- 3గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఎక్స్‌పర్ట్స్‌తో ముఖాముఖి
- సాయంత్రం 5 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు, అరకు ఫ్యాషన్‌షో, గిరిజన నృత్యాలు, మార్షల్ ఆర్ట్స్, ఫుట్‌స్టెప్స్, సినీ కళాకారులతో కామెడీ స్కిట్స్,

ఫిబ్రవరి 2వ తేదీ: ఉదయం 7గంటలకు సుంకర మెట్ట కాఫీ తోటల్లో అరకు ట్రెక్

- ఉదయం 10 గంటలకు అరకులోయలో రంగోళి పోటీలు
- మధ్యాహ్నం 12 గంటల నుంచి అరకులోయ గిరిజన మ్యూజియంలో ప్లాస్‌మోబో సాంస్కృతిక కార్యక్రమాలు
- సాయంత్రం 6గంటల నుంచి ఉత్సవ ముగింపు వేడుకలు, ముఖ్య అతిథుల ప్రసంగాలు

88 కేంద్రాల్లో ఇంటర్ ప్రయోగ పరీక్షలు

● డీఐఈవో సుజాత



లెక్చరర్ల శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్న డీఐఈవో సుజాత

యలమంచిలి రూరల్: ఇంటర్ ప్రయోగ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి బి.సుజాత చెప్పారు. గురువారం యలమంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ లెక్చరర్లకు ఒక రోజు శిక్షణ తరగతులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లెక్చరర్లంతా నిబంధనల ప్రకారం ప్రయోగ పరీక్షలు నిర్వహించాలన్నారు. ప్రతిరోజూ రెండు సెషన్లలో జరిగే పరీక్షలకు సంబంధించి ఆయా సెషన్ల సమయం ముగిసిన వెంటనే విద్యార్థుల జవాబు పత్రాల మూల్యాంకనం పూర్తి చేసి మార్కులను పోస్టు చేయాల్సి ఉంటుందని చెప్పారు. పరీక్షలు జరిగే అన్ని ల్యాబుల్లో సీసీ కెమెరాలు తప్పనిసరిగా పెట్టాలన్నారు. వచ్చే నెల 10వ తేదీ నుంచి జిల్లాలో 88 పరీక్ష కేంద్రాల్లో ప్రయోగ పరీక్షలు జరగనున్నట్టు తెలిపారు. మొత్తం 13,255 మంది విద్యార్థులు పరీక్షలు రాయనుండగా, వచ్చే నెల 10న ప్రారంభమైన పరీక్షలు 20వ తేదీతో పూర్తవుతాయన్నారు. ముందుగా వచ్చే నెల 5వ తేదీ నుంచి వొకేషనల్ విద్యార్థులకు ప్రయోగ పరీక్షలు ప్రారంభమవుతాయన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు వచ్చే నెల 1న నైతికత, మానవీయ విలువలు, ఫిబ్రవరి 3న పర్యావరణ విద్య పరీక్షలు జరుగుతాయని, ఈ రెండు పరీక్షల్లో విద్యార్థులు తప్పనిసరిగా ఉత్తీర్ణత సాధించాలన్నారు. జనరల్ విద్యార్థులకు ఇంటర్ ప్రయోగ పరీక్షలు పక్కాగా నిర్వహించడానికి జిల్లా వ్యాప్తంగా పరీక్ష కేంద్రాలను విస్తృతంగా తనిఖీ చేయడానికి 3 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు నియమించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో యలమంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, లాలంకోడూరు కళాశాల ప్రిన్సిపాల్ స్వామినాయుడు, ప్రేమ్‌కుమార్, చక్రధర్, భాగ్యమతి, జిల్లాలో వివిధ కళాశాలల్లో పనిచేస్తున్న సుమారు 300 మంది అధ్యాపకులు పాల్గొన్నారు.

8న షడ్భుజ వేంకటేశ్వర ద్విశతి పద్యకావ్యం ఆవిష్కరణ

నక్కపల్లి: తిరుమల తిరుపతి అనుబంధ దేవాలయం ఉపమాక గరుడాద్రిపై కల్కి అవతారంలో షడ్భుజములతో అశ్వంపై స్వయం వ్యక్తమై వెలసిన శ్రీవేంకటేశ్వర స్వామిపై 30 మంది పండితులు రచించిన షడ్భుజ వేంకటేశ్వరా ద్విశతి పద్యకావ్యాన్ని ఫిబ్రవరి 8న ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆవిష్కరిస్తున్నట్టు తరిగొండ వెంగమాంబ సాహిత్యపీఠం వ్యవస్థాపకురాలు, ప్రముఖ వేద పండితురాలు డాక్టర్ గొట్టుముక్కల గాయత్రీదేవి తెలిపారు. కార్యక్రమం హైదరాబాద్‌కు చెందిన అనంతచ్ఛందం, తరిగొండ వేంగమాంబ సాహిత్యపీఠం సంయుక్త పర్యవేక్షణలో నిర్వహించడం జరుగుతోందన్నారు.

అనంతచ్ఛందం సమూహ అధ్యక్షుడు తోపెల్ల బాలసుబ్రహ్మణ్యశర్మ అధ్యక్షతన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పుస్తకావిష్కరణ అనంతరం తిరుపతికి చెందిన యువ అవధాని ఉప్పల దడియం భరత శర్మ అష్టావధానం ఏర్పాటు చేసినట్టు గాయత్రీదేవి తెలిపారు. తిరుపతిలోని రాష్ట్రీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్న భరతశర్మ వయసు 18 ఏళ్లు. 15వ ఏటకే అష్టావధానం, 16వ ఏట శతావధానం చేశారు.

మెగా డీఎస్సీ ఎక్కడ...?

- నిరుద్యోగ భృతి తక్షణమే ఇవ్వాలి
- ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షునిగా వేముల కన్నబాబు



జిల్లా నూతన కార్యవర్గ సభ్యులతో ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహంకాళి సుబ్బారావు

అనకాపల్లి: సార్వత్రిక ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం నిరుద్యోగులకు నెలకు రూ.3వేలు నిరుద్యోగ భృతి, మెగా డీఎస్సీ అమలు చేయడంలో చంద్రబాబు విఫలమయ్యారని ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహంకాళి సుబ్బారావు విమర్శించారు. స్థానిక కోడుగంటి గోవిందరావు భవనంలో గురువారం ఏఐవైఎఫ్ 2 మహాసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ రంగాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ మోదీ, చంద్రబాబు కలిసి నిరుద్యోగులు జీవితాలతో చెలగాటమాడుతున్నారని ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఎవరికిచ్చారో చెప్పాలన్నారు. సీపీఎం జిల్లా సహాయ కార్యదర్శులు రాజాన దొరబాబు, రామునాయుడు మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉపాధి కల్పించని కూటమి ప్రభుత్వంపై దశలు వారిగా ఉద్యమాలు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.సన్యాసిరావు, అప్పలరాజు, సత్యనారాయణ, అర్జున్‌రావు, పోతురాజు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షునిగా వేముల కన్నబాబు, జిల్లా కార్యదర్శిగా వియ్యపు రాజు, ఉపాధ్యక్షునిగా కరక సురేష్, సహాయ కార్యదర్శులుగా జి.ఫణీంద్ర కుమార్, డొక్కరి హరీష్, కోశాధికారిగా జి.రాధాకృష్ణ, కార్యవర్గ సభ్యులుగా ఎం.సత్తిబాబు, బి.బాబ్జి, ఎం.శివ, సంతోష్, జి.చైతన్యలు ఎన్నికయ్యారు.

ఘనంగా బొడ్డేడ జన్మదిన వేడుకలు



బొడ్డేడ ప్రసాద్ జన్మదిన కేక్‌ను కట్ చేస్తున్న మాజీమంత్రులు కన్నబాబు, అమర్‌నాథ్, మాజీ డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

మునగపాక : వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పలు ప్రాంతాలకు చెందిన పార్టీ నేతలు, అభిమానులు ప్రసాద్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. మునగపాక దళితవాడలో సర్పంచ్ దిమ్మల అప్పారావు, కాలనీ వాసులు ఏర్పాటు చేసిన కేక్‌ను ప్రసాద్ కట్ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. పార్టీ కార్యాలయం వద్ద జరిగిన వేడుకల్లో మాజీ మంత్రులు కురసాల కన్నబాబు, గుడివాడ అమర్‌నాథ్, మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మాజీ ఎంఎల్‌సీ సూర్యనారాయణరాజు, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు కరణం ధర్మశ్రీ, ఎంఎల్‌సీ వరుదు కళ్యాణి, పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త కంబాల జోగులు తదితరులు ప్రసాద్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనకాపల్లి జిల్లా పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన ఎంపీపీలు,జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు,ఎంపీటీసీలు,పార్టీ శ్రేణులు ప్రసాద్ పుట్టిన రోజు వేడుకలకు హాజరయ్యారు. కాగా ప్రసాద్ జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన వచ్చింది. ఈ శిబిరాన్ని సందర్శించిన ప్రసాద్ మాట్లాడుతూ రక్తదానం ద్వారా ఎంతో మంది ప్రాణాలను కాపాడేవారమవుతామన్నారు.

ఎస్సీ కాలనీలో విధ్వంసం కేసులో ఇద్దరి అరెస్టు

డీఎస్పీ శ్రీనివాసరావు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

నర్సీపట్నం : నర్సీపట్నం ఎస్సీ కాలనీలో విధ్వంసానికి పాల్పడిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ ఘటనలో పాత నేరస్తుడు రౌతు మల్లేష్ కుమారుడు కుమార్, మరో వ్యక్తి సాయికిరణ్‌ను అరెస్టు చేసినట్టు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రౌడీయిజం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, ఎస్పీ ఆదేశాల మేరకు రౌడీ మూకల ఆట కట్టించేందుకు ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. పాత నేరస్తుడు రౌతు మల్లేష్, ఇద్దరు కుమారులు, మరికొందరు ఈనెల 28న నర్సీపట్నం ఎస్సీ కాలనీలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మద్యం తాగుతూ విగ్రహాన్ని ధ్వంసం చేస్తుండగా నిలదీసిన దుర్గాప్రసాద్‌పై దాడి చేశారన్నారు. ఇళ్లలోకి దూరి వాహనాలను దగ్ధం చేశారన్నారు. విద్యుత్ సిబ్బందిపై దాడి చేశారన్నారు. సంఘటన స్థలానికి వెళ్లిన పోలీసులను రాళ్లు, కత్తులతో బెదిరించి పరారయ్యారన్నారు. దుర్గాప్రసాద్ ఇంట్లోకి వెళ్లి మంచంపై పెట్రోల్ పోసి నిప్పుపెట్టారన్నారు. రెండు ప్రైవేటు అంబులెన్స్‌లను ధ్వంసం చేశారన్నారు. విద్యుత్తును పునరుద్ధరించడానికి వచ్చిన లైన్‌మన్‌పై దాడి చేశారన్నారు. నిందితులపై ఎస్సీ, ఎస్టీ, హత్యాయత్నం, దాడికి సంబంధించి మూడు కేసులు పెట్టామన్నారు. కాలనీలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో సీఐ గోవిందరావు ఉన్నారు.

వివాహిత ఆత్మహత్య కేసులో నలుగురు అరెస్టు



కశింకోట పోలీసు స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతున్న అనకాపల్లి డీఎస్పీ శ్రావణి

కశింకోట : మండలంలోని వెదురుపర్తి గ్రామంలో అత్తింటి వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన కేసులో భర్త సహా నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు డీఎస్పీ ఎం.శ్రావణి తెలిపారు. కశింకోట పోలీసు స్టేషన్‌లో గురువారం విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. వెదురుపర్తి గ్రామానికి చెందిన పలివెల కృపాసాగర్(32)కు, పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరు మండలం కాపవరం గ్రామానికి చెందిన మిరియాల సుమ(29)కు 2019లో వివాహం జరిగిందన్నారు. ఆ సమయంలో వధువు కుటుంబీకులు రూ.లక్ష కట్నం, మరో రూ.లక్ష ఇతర లాంఛనాలకు, రూ.30 వేలు ఆడపడుచు లాంఛనాలుగా ఇచ్చారన్నారు. కొంత కాలం పాటు వారి కాపురం సజావుగానే సాగిందన్నారు. ఇద్దరు ఆడ పిల్లలు కలిగారన్నారు. తర్వాత కొన్నాళ్లకు అత్త పార్వతి(48), మామ అప్పారావు(50), ఆడ పడుచు మేరీ(30) కలిపి సుమను అదనపు కట్నం తెమ్మని వేధించారని, దీంతో దఫదఫాలుగా నగదు ఇచ్చారన్నారు. చివరగా ఇటీవల అదనపు కట్నం తెమ్మనగా రూ.10 వేలు అప్పు చేసి ఇచ్చినట్టు తల్లి మిరియాల వెంకయ్యమ్మ పేర్కొన్నారన్నారు. అయినా ఇంకా డబ్బు కోసం వేధింపులు ఎక్కువవంతో తీవ్ర మనస్థాపానికి గురై ఇంట్లో చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. ఈ మేరకు తల్లి వెంకయ్యమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపి భర్త, అత్తమామ, ఆడపడుచులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు డీఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో సీఐ అల్లు స్వామినాయుడు, ఎస్ఐ కె.లక్ష్మణరావు పాల్గొన్నారు.

మద్యం తరలిస్తున్న మహిళ అరెస్ట్



పట్టుబడిన మద్యం సీసాలతో సీఐ సునీల్ కుమార్, సిబ్బంది

నర్సీపట్నం : పట్టణంలోని గుర్రాల రోడ్డులో అక్రమంగా మద్యం కలిగి ఉన్న మహిళను అరెస్టు చేశామని ఎక్సైజ్ సీఐ కె.సునీల్ కుమార్ తెలిపారు. కోటవురట్ల మండలం, యండపల్లి గ్రామానికి చెందిన చిలకమ్మ నుంచి ఏడు మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు.

గురువారమే రిమాండ్‌కు తరలించారు. ఈ దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ నారాయణరావు, లావణ్య పాల్గొన్నారు.

గంజాయితో ఇద్దరు యువకుల అరెస్ట్



ద్విచక్ర వాహనంలో తరలిస్తున్న గంజాయిని పట్టుకున్న పోలీసులు

కె.కోటపాడు : ఒడిశా రాష్ట్రం పాడువా మండలం నుంచి గంజాయిని తీసుకువస్తూ ఇద్దరు యువకులు కె.కోటపాడు పోలీసులకు గురువారం పట్టుబడ్డారు. కె.కోటపాడు గ్రామ శివారు చల్లా వారి కళ్లాల వద్ద పోలీసులు వాహన తనిఖీల్లో భాగంగా కె.కోటపాడు మీదుగా విశాఖపట్నానికి ద్విచక్రవాహనంపై వెళ్తున్న పి.బాల దుర్గా గణేష్, కె.సూర్యను ఆపి వాహనం తనిఖీ చేయగా బ్యాగ్‌లో కిలోన్నర గంజాయిని గుర్తించారు. వారు నాలుగు రోజుల క్రితం ఒడిశా ప్రాంతానికి వెళ్లి గంజాయిని తీసుకువస్తున్నట్టు విచారణలో తేలింది. పట్టుబడ్డ గంజాయి విలువ రూ.7500 ఉంటుందని పోలీసులు తెలిపారు.

ద్విచక్రవాహనంతో పాటు ఒక సెల్‌ఫోన్‌ను సీజ్ చేసినట్టు కె.కోటపాడు ఎస్ఐ ఆర్.ధనుంజయ్ తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

కూరగాయల రైతులకు ప్రోత్సాహకాలు



కె.సంతపాలెంలో కూరగాయల పంటలను పరిశీలిస్తున్న ప్రభాకరరావు

కె.కోటపాడు : కూరగాయల పంటలు సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహం అందజేస్తుందని జిల్లా ఉద్యానవనశాఖాధికారి ప్రభాకరరావు తెలిపారు. మండలంలో కె.సంతపాలెం గ్రామంలో గురువారం కూరగాయల పంటలను పరిశీలించారు. మండలంలో కె.సంతపాలెం, ఆర్లి, సూదివలస, కింతాడ, చోడవరం మండలంలో గల అడ్డూరు, సబ్బవరం మండలంలో వంగలి, అమృతపురం గ్రామాలను వెజిటబుల్ క్లస్టర్‌లుగా గుర్తించడం జరిగిందన్నారు.

4 నుంచి కన్యకాపరమేశ్వరి ప్రతిష్ట శతజయంతి ముగింపోత్సవాలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఉత్సవాల చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు

అనకాపల్లి : కన్యకాపరమేశ్వరి అమ్మవారి ప్రతిష్ట శత జయంతి ఉత్సవాల ముగింపు కార్యక్రమం ఫిబ్రవరి 4 నుంచి 8వ తేదీ వరకూ నిర్వహిస్తున్నామని ఉత్సవాల చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు అన్నారు. స్థానిక ఉప్పల చంద్రశేఖర్ కల్యాణ మండపం ఆవరణలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కన్యకాపరమేశ్వరి అమ్మవారి విగ్రహాన్ని 1913లో ఏర్పాటు చేసి, 1914లో కమిటీని నిర్వహించామని, 1925 నాటికి అమ్మవారి ఆలయాన్ని 5.5 ఎకరాల్లో నిర్మించడం జరిగిందన్నారు. 1925లో కొత్తగా 12 మంది సభ్యులతో నూతన కమిటీని ఏర్పాటు చేసి అమ్మవారి ఉత్సవాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు.

తెలంగాణ, ఏపీల్లో కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో అమ్మవారి మూడు వెండి రథాలు ఉన్నాయని, నాలుగో రథం అనకాపల్లి కన్యకాపరమేశ్వరి ఆలయంలో గత ఏడాది ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆలయ అధ్యక్షుడు కృష్ణకుమార్, ప్రతిష్ట శతజయంతి ఉత్సవాల కో చైర్మన్ డాక్టర్ గ్రంధి శేషుకుమార్ మాట్లాడుతూ శనివారం కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. తెల్లవారుజామున నగర సంకీర్తనలు, గోపూజ, అమ్మవారికి పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు, నిత్య ప్రార్థన, లలితా సహస్రనామ స్తోత్రపారాయణ, మధ్యాహ్నం అన్నదానం, రాత్రికి 102 వెండి ప్రమిదలతో జ్యోతుల ఆరాధన ఉంటాయన్నారు. ఫిబ్రవరి 4న అమ్మవారి శోభాయాత్ర, 5న సామూహిక లక్ష తులసి నామార్చనలు, 6న నగరేశ్వర స్వామి వారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, 108 మంది సుహాసినిల పూజ, 7న లక్ష కుంకుమ నామార్చనలు, చండీహోమం, ఏకోత్తర సహస్ర(1001) కలశ మండపారాధన, 8న ఆలయంలో తెల్లవారు జాము నుంచి ప్రత్యేక పూజలు, మహా కుంభాభిషేకం, మధ్యాహ్నం అన్నసమారాధన, సాయంత్రం నగరేశ్వరస్వామి, జనార్ధన వార్ల వార్షిక తిరు కల్యాణ మహోత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కార్యదర్శి జగదీశ్వరరావు, కోశాధికారి సోమరాజు, ఉత్సవ కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జాతీయ సమైక్యతా శిబిరానికి విద్యార్థిని ఎంపిక



జాతీయ సమైక్యత శిబిరానికి ఎంపికైన విద్యార్థినిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

చోడవరం రూరల్ : జాతీయ సమైక్యతా శిబిరానికి స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని సవరాల వెంకటలక్ష్మి ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 4 నుండి వారం రోజుల పాటు ఛండీగఢ్ యూనివర్శిటీలో జాతీయ సమైక్యతా శిబిరం నిర్వహిస్తారని తెలిపారు. వివిధ రాష్ట్రాల నుంచి ఎంపికైన వలంటీర్లు ఈ శిబిరంలో పాల్గొని వారి సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే ప్రదర్శనలు చేస్తారని పేర్కొన్నారు. తమ కళాశాలలో బీఎస్సీ రెండో సంవత్సర విద్యార్థిని వెంకటలక్ష్మి ఆంధ్రా యూనివర్శిటీ ప్రతినిధిగా ఎంపికైందని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు వి.రత్నభారతి, బి.పిచ్చమ్మ, డి.మాల్యాద్రి తెలిపారు. తమ కళాశాల నుంచి విద్యార్థినిని ఎంపిక చేసిన ఏయూ ఎన్ఎస్ఎస్ పీవో ప్రొఫెసర్ ఎస్.హరినాథ్, డీపీఓ భాగ్యలక్ష్మిలకు కృతజ్ఞతలు తెలిపారు.

క్లుప్తంగా

నవోదయ మోడల్ టెస్ట్ విజేతలకు బహుమతులు



విద్యార్థులకు జ్ఞాపికలు అందజేస్తున్న గోపినాథ్, బుద్ధ కాశీవిశ్వేశ్వరరావు

అనకాపల్లి: నవోదయ మోడల్ టెస్ట్‌లో ప్రతిభ చూపిన పట్టణానికి చెందిన ఐదుగురు విద్యార్థులకు గురువారం స్థానిక నర్సింగరావుపేట పీఆర్టీయూ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు గోపినాథ్ జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లాలో ఎనిమిది కేంద్రాల్లో నవోదయ మోడల్ టెస్ట్ నిర్వహించగా వెయ్యి మంది విద్యార్థులకు హాజరయ్యారన్నారు. అనకాపల్లి పరిసర ప్రాంతాలకు చెందిన 286 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, పట్టణ పరిధిలో ఐదుగురు విద్యార్థుల ఉత్తమ ఫలితాలు సాధించారన్నారు. కార్యక్రమంలో యూనియన్ పట్టణ గౌరవాధ్యక్షుడు బుద్ధ కాశీవిశ్వేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దినాయుడు, పట్టణ కార్యదర్శి గొర్లి అర్జున, రాష్ట్ర కమిటీ సభ్యుడు ఏవీ రామచంద్రరావు, దాసరి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

బెట్టు దిగని బీర ధర

కశింకోట: స్థానిక వారపు సంతలో కూరగాయల ధరలు గురువారం కాస్త తగ్గాయి. కిలో టమాటా రూ.20 నుంచి రూ.15, ఉల్లి, బంగాళదుంప రూ.40 నుంచి రూ.30, వంకాయి రూ.60 నుంచి రూ.40కి తగ్గాయి. ఎప్పటిలాగే బరబాటి రూ.40, బీట్రూట్, క్యారెట్, చామదుంప, బీన్స్ కాయలు రూ.60, క్యాప్సికం రూ.80కి విక్రయాలు సాగాయి. బీరకాయ మాత్రం బెట్టు మీద రూ.90కు అమ్మకాలు సాగాయి.

అనధికార మద్యం విక్రయాలపై దాడులు



సిబ్బందితో దాడులు చేస్తున్న ఎక్సైజ్ సీఐ లక్ష్మీనాయుడు

కశింకోట: ఎక్సైజ్ పోలీసుల గురువారం సాయంత్రం కశింకోటలో హల్‌చల్ చేశారు. అనకాపల్లి ఎక్సైజ్ సీఐ లక్ష్మీనాయుడు, తమ సిబ్బందితో వచ్చి స్థానిక సంతబయల, పూసర్ల వీధి ప్రాంతాల్లో మద్యం దుకాణాల వద్ద పక్కన లూజు విక్రయాలు జరుగుతుండటంతో ఆకస్మిక దాడి చేశారు. ఈ విషయం తెలియడంతో నిర్వాహకులు పరారయ్యారు. ఇకపై లూజు అమ్మకాలు విక్రయిస్తే ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. తమ పరిధిలో అనధికారిక మద్యం అమ్మకాలు సాగకుండా ఎప్పటికప్పుడు దాడులు చేస్తున్నామన్నారు.

సారె ఊరేగింపు

ఎస్.రాయవరం: గౌరీ పరమేశ్వర్ల సారె ఊరేగింపు గురువారం ఘనంగా నిర్వహించారు. కార్తీక మాసంలో ఎస్.రాయవరంలోని బజారులో స్టేజ్‌పై నిలిపిన గౌరీ పరమేశ్వర్ల విగ్రహాలకు పూజలు చేస్తున్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు గురువారం 8,479 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,840	4,490
మొదటి రకం	3,320	4.000
రెండో రకం	3,940	3,440
మూడో రకం	2,670	3,050

అనకాపల్లి సినిమాలు

డాకు మహారాజ్	:రాజా
పుష్ప-2	:సత్యనారాయణ స్క్రీన్-1
ప్రేమిస్తావా	సత్యనారాయణ స్క్రీన్-2
మదగజరాజ	:పర్తిసాయి
సంక్రాంతికి వస్తున్నాం	: షిర్డీసాయి
ఏజెంట్ గయ్ 001	:వెంకటేశ్వర
గేమ్ ఛేంజర్	:శ్రీసత్య
మహేష్	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 106 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-11 యూనిట్లు, బీ పాజిటివ్-35 యూనిట్లు, ఓ పాజిటివ్-51 యూనిట్లు, ఏబీ పాజిటివ్-8 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 381 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 348 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924–223595 నంబరును సంప్రదించవచ్చు.



అనకాపల్లి మండలం బట్లపూడిలో చిన్నారి చెయ్యిపై మచ్చలను పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది



గొలగాం గ్రామంలో మహిళ మచ్చలు పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది



అనకాపల్లి మండలం గుండా జంక్షన్ వద్ద రోగులతో మాట్లాడుతున్న వైద్య సిబ్బంది

కుష్టువ్యాధిని అరికట్టేలా..

- చురుగ్గా కుష్టువ్యాధి గుర్తింపు సర్వే
- లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి
- మందులతో వ్యాధి నయం
- తుమ్మపాల పీహెచ్‌సీ పరిధిలో కొత్త కేసు గుర్తింపు

అనకాపల్లి: కుష్టు వ్యాధి ఒక ప్రాణాంతకారమైన అంటువ్యాధిగా గతంలో భావించేవారు. ఈ రోగులను ఊరుబయట ఉంచేవారు. వ్యాధిగ్రస్తుల దగ్గరకు వెళ్లేందుకు కుటుంబ సభ్యులే ఇష్టపడేవారు కాదు. కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వాలు కుష్టువ్యాధిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో ప్రస్తుతం రోగులు అందరితో సాధారణ జీవితంతో గడుపుతున్నారు. ప్రభుత్వం ఉచితంగా ఇచ్చే మందులు వాడుతూ వ్యాధిని నయం చేసుకుంటున్నారు. తద్వారా అంగవైకల్యం రాకుండా చేసుకుంటున్నారు. 15 సంవత్సరాలు క్రితమే ఈ వ్యాధి అంతం కావల్సి ఉన్నప్పటికీ ప్రతి ఏడాది అక్కడక్కడ కేసులు నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో చేపట్టిన కుష్టువ్యాధి లక్షణాల గుర్తింపు సర్వే చురుగ్గా సాగుతోంది. వచ్చే నెల 13వ తేదీ వరకు ఈ సర్వే కొనసాగనుంది.

- కుష్టు వ్యాధి ఒక బ్యాక్టీరియా ద్వారా వస్తుంది. వ్యాధి లక్షణాలను సులభంగా గుర్తించవచ్చు. చర్మం మీద స్పర్శ లేని మచ్చలు ఉన్నవారు దగ్గరలో ఆరోగ్య కేంద్రంలో పరీక్ష చేసుకుని చికిత్స పొందవచ్చు.
- ఆరోగ్య కేంద్రంలో రోగులకు ఎండీటీ మందులను ఉచితంగా సరఫరా చేస్తున్నారు. సకాలంలో వైద్యం వల్ల వ్యాధి పూర్తిగా నయమవుతుంది. అంగవైకల్యం రాకుండా నివారించవచ్చు. చర్మంపైన ఏ విధమైన మచ్చలు ఉన్నా, నిర్లక్ష్యం చేయకుండా ఆస్పత్రికి వెళ్లి పరీక్షించుకోవాలి.
- వ్యాధిసోకిన వ్యక్తికి 6 నుంచి 12 మాసాల్లో వ్యాధిని నివారించవచ్చు.



తుమ్మపాల పీహెచ్‌సీ పరిధిలో కుష్టువ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మండలంలో 32 పంచాయతీలకుగాను తుమ్మపాల, తగరంపూడి పీహెచ్‌సీ పరిధిలో సచివాలయాల ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు కుష్టువ్యాధిపై ఇంటింటి సర్వేలు నిర్వహిస్తున్నారు. మండలంలో 168 మంది రోగులకు పరీక్షలు నిమిత్తం పంపించారు. తుమ్మపాల పీహెచ్‌సీ పరిధిలో ఒక వ్యక్తికి వ్యాధి లక్షణాలు ఉన్నట్లు నిర్ధారణ చేసి మందులు పంపిణీ చేస్తున్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచితంగా మందులు

ప్రభుత్వ ఆస్పత్రిలో బహుళ ఔషధ చికిత్స (మల్టిడ్రగ్ థెరపీ) ద్వారా కుష్టువ్యాధికి మందులు ఉచితంగా అందజేస్తున్నారు. ముందుగా వైద్యుడు వ్యాధి నిర్ధారణ చేస్తారు. ఆ తర్వాత మొదటి నెల వైద్యుని వద్ద, రెండో నెల నుంచి ఏఎస్ఎం, ఆశవర్కరు ద్వారా ఇంటి వద్దే ఉచితంగా మందులు పంపిణీ చేస్తారు. వైద్యులు సూచనల మేరకు నిర్ణీత కాలానికి మందులు క్రమం తప్పకుండా వాడాల్సి ఉంటుంది.

కుష్టువ్యాధి లక్షణాలు..

- చర్మంపై స్పర్శలేని మచ్చలు
- మందమైన మెరిసే జిడ్డుగల చర్మం
- చెవులపై, వీపులపై, ఎదపై నొప్పిలేని బుడిపెలు
- కనుబొమ్మలు, కనురెప్పలు వెంట్రుకలు రాలిపోవడం
- కనురెప్పలు మూతపడకపోవడం
- ముక్కుదిబ్బడ, ముక్కులో నుంచి రక్తం కారడం
- కాళ్లు, చేతులు తిమ్మిర్లు కలిగి ఉండుట, పాదాల వాపు
- అరచేతులు, అరికాళ్లలో స్పర్శ కోల్పోవడం
- చల్లని లేదా వేడి వస్తువులను గుర్తించలేకపోవడం
- చేతుల నుంచి వస్తువులు జారిపోవడం
- కాళ్లకు చెప్పులు జారిపోవడం
- తెలియకుండానే చేతులు, కాళ్లలో బొబ్బలు రావడం
- చేతి, కాలు వేళ్లు వంకర్లు తిరిగి అంగవైకల్యం రావడం

ఇంటింటి సర్వే ద్వారా అవగాహన



గతంలో కుష్టువ్యాధి సోకిందంటే భయంతో బాధపడేవారు. ప్రస్తుతం అటువంటి పరిస్థితి లేకుండా పోయింది. కుష్టుపై అవగాహన కార్యక్రమాలు వచ్చే నెల 13వ తేదీ వరకూ నిర్వహిస్తాం. వ్యాధి లక్షణాలు ఉన్న రోగులు భయపడకుండా సకాలంలో మందులు వాడినట్లయితే ఆరోగ్యంగా జీవించవచ్చు. వ్యాధి సోకిన రోగిని వారి గృహంలో ఉంటూ వైద్యసేవలు పొందవచ్చు. పాత రోగికి రెండు మాసాలుగా మందులు పంపిణీ చేస్తున్నాం. మరో కేసు కొత్తగా గుర్తించి మందులు పంపిణీ చేస్తున్నాం. 15 సంవత్సరాల క్రితం వ్యాధి సోకిన 11 మంది రోగులకు ఎంసీఆర్ చెప్పులు పంపిణీ చేశాం.

–వైద్యాధికారి షేక్ నజరత్‌సమీమ్, తుమ్మపాల పీహెచ్‌సీ, అనకాపల్లి మండలం

గాంధీజీకి ఘన నివాళి



గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కోటేశ్వరరావు



గాంధీజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం



వెదురుపర్తి హైస్కూలులో మహాత్మాగాంధీ విగ్రహానికి నివాళులు

అనకాపల్లి: స్థానిక గాంధీనగరం మెయిన్ రోడ్డులో మహాత్మాగాంధీ 78వ వర్ధంతి కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలపురెడ్డి కోటేశ్వరరావు గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ నేటి పాలకులు దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన గాంధీజీ వర్ధంతి నిర్వహించడంలో విఫలమైనట్లు విమర్శించారు. నేటి యువత గాంధీజీ ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు పి.ఎస్.దత్తు, కత్తెర శ్రీధర్, కాళ్ల సత్యనారాయణ, తుట్టా రమణ, బి.బాలమురళి, భానుయాదవ్, జి.గున్నబాబు పాల్గొన్నారు.

కశింకోట: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా మండల పరిషత్ సర్వ సభ సమావేశం మహాత్మాగాంధీ నివాళికి పరిమితమైంది. ముందుగా నిర్ణయించిన ప్రకారం గురువారం సమావేశం నిర్వహించాల్సి ఉంది. ఇంతలో ఎన్నికల కోడ్ రావడం వల్ల సమావేశం ప్రారంభం కాగానే గాంధీ చిత్రపటానికి ఎంపీపీ కలగా లక్ష్మి, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఇక మండల సమావేశం నిర్వహించకుండా వాయిదా వేశారు. ఉగ్గినపాలెం సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు, జెడ్పీటీసీ దంతులూరి శ్రీధర్‌రాజు, ఎంపీడీవో వి.వి. రవికుమార్, ఈవోపీఆర్డీ ఎం. వెంకటలక్ష్మి పాల్గొన్నారు. గురువారం వెదురుపర్తి హైస్కూలులో జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. హెచ్ఎం ఎ.వి.ఎస్. మూర్తి గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మహాత్ముని ఆలోచనలు, ఆశయాలను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. ఉపాధ్యాయ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఏలేరు కాలువకు రక్షణ గోడ నిర్మించాలి

వాహనదారుల నిరసన



నినాదాలు చేస్తున్న వాహనదారులు

తుమ్మపాల: మండలంలో శంకరం–బొజ్జన్నకొండ వద్ద ఏలేరు కాలువకు రక్షణ గోడ నిర్మించి తమ ప్రాణాలు కాపాడాలంటూ ఆమ్‌ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో వాహనదారులు గురువారం నిరసన చేపట్టారు. ఏలేరు కాలువ నిర్మించిన నాటి నుంచి 20 మందికి పైగా అదుపుతప్పి అందులో పడి మృతి చెందారని పార్టీ జిల్లా అధ్యక్షుడు కొణతాల హరినాథ్‌బాబు తెలిపారు. ఏలేరు కాలువ ఆనుకుని బొజ్జన్నకొండ రహదారి ఉన్నందున వాహనదారులు రాకపోకలకు జంకుతున్నారన్నారు. అధికారులు స్పందించి ఏలేరు కాలువకు రక్షణ గోడ నిర్మించాలని డిమాండ్ చేశారు. పర్యాటక ప్రాంతం బొజ్జన్నకొండ రోడ్డుపై క్వారీ టిప్పర్ల రాకపోకలను నిలిపివేయాలన్నారు. కార్యక్రమంలో గోపిశెట్టి మహాలక్ష్మినాయుడు, మహిళలు పాల్గొన్నారు.

ధ్రువీకరణ పత్రాల జారీలో తీవ్ర నిర్లక్ష్యం

బీఎస్పీ నియోజకవర్గ కన్వీనర్ సూదికొండ మాణిక్యాలరావు



తుమ్మపాల: మండలంలో ప్రజలకు అవసరమైన వివిధ ధ్రువీకరణ పత్రాల జారీ విషయంలో తీవ్ర నిర్లక్ష్యం జరుగుతుందని, సకాలంలో మంజూరు కాక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీఎస్పీ నియోజకవర్గ కన్వీనర్ సూదికొండ మాణిక్యాలరావు అన్నారు. పట్టణంలో పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, విద్య, ఉద్యోగం అవసరాలకు చేసుకుంటున్న కుల, ఆదాయ నివాస, భూముల డిజిటల్ సంతకం వంటి ధ్రువీకరణ పత్రాల జారీపై మండల రెవెన్యూ అధికారులు తీవ్ర నిర్లక్ష్యంగా ఉంటున్నారన్నారు. అర్జీ గడువు ముగిసినా మంజూరు చేయడం లేదని, ప్రజలను ఇబ్బందులకు గురిచేయకుండా వేగంగా పనులు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం పౌరసేవలను అత్యంత వేగంగాను, సులభంగాను వాట్సాప్ ద్వారా చేసేవిధంగా రూపకల్పన చేస్తే, అధికారులు మాత్రం ప్రజలపై అధికార ధోరణితోనే వ్యవహరిస్తున్నారన్నారు.

నేడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తీర్థం



కశింకోట: అమీన్‌సాహెబ్‌పేట గ్రామంలో మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తీర్థ మహోత్సవాన్ని శుక్రవారం నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. జిల్లాలో తొలిసారిగా 2009 నుంచి ఏటా ఇక్కడ వైఎస్సార్ పేరిట తీర్థ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఇది మండల తీర్థాల్లో చివరిది. ఈ తీర్థానికి మండలంతోపాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు, పార్టీ శ్రేణులు, అభిమానులు ఉత్సాహంగా తరలి వస్తారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ ప్రోత్సాహంతో, మలసాల వెంకట రమణారత్నం ఆర్థిక సాయంతో ఎప్పటిలాగే భారీ స్థాయిలో నిర్వహించనున్నట్లు పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, ఉత్సవ ఆర్గనైజర్, మాజీ సర్పంచ్ మలసాల అనూరాధ తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తామన్నారు. కోలాటాలు, మహిళలకు ఉదయం 8 గంటల నుంచి మండల స్థాయి ముగ్గుల పోటీలు, మధ్యాహ్నం 12 గంటలకు భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశామన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు జిల్లా స్థాయి ఆహ్వానపు గుర్రాల పరుగు పోటీలు జరుగుతాయన్నారు. వీటిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థి, పంచమ బహుమతులు వరుసగా రూ. 9 వేలు, రూ.8 వేలు, రూ.7 వేలు, రూ.6 వేలు, రూ.5 వేలు వంతున అందజేస్తామన్నారు. మధ్యాహ్నం ఆనందపురానికి చెందిన శ్రీదేవి బృందం బుర్రకథ, రాత్రి 8 గంటలకు టీవీ కళాకారులతో డాన్స్ షో ఏర్పాటు చేశామన్నారు. పెద్ద ఎత్తున విద్యుద్దీపాలంకరణ ఏర్పాటుతోపాటు బాణసంచా కాలుస్తామన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు పాటుపడాలి



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరరావు

మునగపాక: బీజేపీ మండల అధ్యక్షుడు మళ్ల కాలేశ్వరరావు ఆధ్వర్యంలో మండలంలోని ఉమ్మలాడలో నందివాన్ గౌరవ దివస్ అభియాన్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేష్ హాజరై రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ మాస్టారు, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు జేవీఎస్ వర్మ, జిల్లా గౌరవాధ్యక్షులు మొల్లేటి వాసు, వెంకట జగదీశ్వరరావు, రామకృష్ణ, శ్రీనివాసరావు, విజయకుమార్, గణేష్, మద్దాల రాము తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

పొగ మంచుతో ఇబ్బందులు



శారదానది ప్రాంతంలో ఆవహించి ఉన్న మంచు పొర

కశింకోట: మైదాన ప్రాంతంలో ఏజెన్సీని తలపించే విధంగా మంచు కురుస్తోంది. కశింకోటలో గురువారం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతం వరకు సూర్యుడు కాన రాలేదు. శారదానది ప్రాంతం, చెట్లు, ఇళ్లు మంచుతో నిండిపోయాయి. సూర్యుడు వచ్చే వరకు మంచు తెరలు వీడకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఆ తర్వాత సూర్యతాపంతో మంచు తెరలు తొలగడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఇలా మంచు పడటం వల్ల నువ్వు సాగుకు నష్టం కలుగుతుందని, మొక్కలు నాటుతున్న దశలోనే ఎండిపోయి పంట దెబ్బతింటుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జీడి, మామిడి పూతకు నష్టం కలిగిస్తుందని వాపోతున్నారు.

బ్రాండిక్స్ పరిశ్రమలో శ్రమ దోపిడీ

యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్



యలమంచిలిలో మాట్లాడుతున్న ఎంపీపీ బోదెపు గోవింద్

యలమంచిలి: బ్రాండిక్స్ పరిశ్రమలో శ్రమ దోపిడీ జరుగుతుందని ఎంపీపీ బోదెపు గోవింద్ విమర్శించారు. పరిశ్రమలో కార్మికుల పనివేళల పెంపును నిరసిస్తూ పెద్ద ఎత్తున మహిళా కార్మికులు ఆందోళన చేపట్టిన నేపథ్యంలో యలమంచిలిలో గురువారం ఆయన స్థానిక మున్సిపల్ కౌన్సిలర్లతో కలసి మాట్లాడారు. ప్రస్తుతం పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుల పనివేళలలో అరగంట ఎక్కువగా పని చేయాలని ఒత్తిడి తీసుకురావడం సమంజసం కాదన్నారు. కార్మిక చట్టం ప్రకారం రోజుకు 8 గంటలే పనిచేయాలని, కార్మికులకు రావాల్సిన బెనిఫిట్స్ ఇచ్చి భద్రత కల్పించాలన్నారు. ఇందుకు విరుద్ధంగా ఏ షిఫ్టుకు వెళ్లేవారు తెల్లవారుజామున 3 గంటలకు లేవాల్సిన పరిస్థితి ఉందన్నారు. మధ్యాహ్నం విధులకు వెళ్లే వారు 12.30కు ముందుగా వెళ్లాల్సి వస్తుందని వాపోయారు. దీనివల్ల ఇంట్లో పనులు చేసుకుని వెళ్లలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, చాలీచాలని వేతనాలకు గంటల తరబడి కుటుంబ పోషణ కోసం పనిచేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో ఇటువంటి పరిస్థితి లేదన్నారు. కార్మికుల పక్షపాతిగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనిచేసిందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులను వేధిస్తున్నారని, వారి సమస్యలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పరిశ్రమల యాజమాన్యాలకు కొమ్ముకాస్తుందన్నారు. పనివేళల పెంపు నిర్ణయం వెనక్కి తీసుకుని, జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మరిణేశ్వరరావు, రాపేటి సంతోష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అనకాపల్లి: విద్యుత్ శాఖ డి–1 సెక్షన్ పరిధిలో విద్యుత్ తీగల మరమ్మతులు, కొత్త లైన్లు ఏర్పాటు నిమిత్తం టౌన్–2 ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఈఈ కె.రాజశేఖర్, ఏఈ త్రినాథ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టౌన్–2 పరిధిలో ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారి, శారదా కాలనీ, న్యూకాలనీ, రాజా థియేటర్ మెయిన్‌రోడ్డు, తహసీల్దార్ కార్యాలయం రహదారిలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు.

తుమ్మపాల: పట్టణంలో సంతబయలు, కొప్పాక విద్యుత్ సబ్ స్టేషన్ల మరమ్మతుల్లో భాగంగా శుక్రవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పట్టణంలో చినరామస్వామి, పెదరామస్వామి, రచ్చరాళ్ల, కర్రి వారి వీధి, సంతబయలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈలు రామకృష్ణ, రాజశేఖర్ వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. మండలంలో బట్లపూడి, రాయుడుపేట, శంకరం, రేబాక గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు.

కశింకోట: మండలంలోని నరసింగబిల్లి విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు కారణంగా, దాని పరిధిలోని గ్రామాలకు శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ కశింకోట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్. రామకృష్ణ తెలిపారు. నరసింగబిల్లితోపాటు జెట్టపురెడ్డితుని, చింతలపాలెం, గొబ్బూరు, తాళ్లపాలెం, బంగారయ్యపేట, ఉగ్గిన పాలెం, పరవాడపాలెం, జమాదులపాలెం, కొత్తపల్లి, బుచ్చియ్యపేట, పేరంటాలపాలెం, గంటవానిపాలెం, ఏఎస్ పేట, గొబ్బూరుపాలెం, నరసాపురం, సోమవరం, ఏనుగుతుని, గొల్లగుంట, జి. భీమవరం, సింగవరం, అచ్చెర్ల, కొత్త అచ్చెర్ల, మోసయ్యపేట, గోకివానిపాలెం గ్రామాలకు నిర్దేశిత సమయంలో విద్యుత్ అంతరాయం కలగనుందన్నారు. ఈ విషయాన్ని గుర్తించి వినియోగదారులు తమ సిబ్బందికి సహకరించాలని కోరారు.

343 జీవాలకు వైద్య పరీక్షలు



వైద్య సేవలందిస్తున్న పశు వైద్యాధికారి దయానా

కశింకోట: మండలంలోని అడ్డాం గ్రామంలో గురువారం ఉచిత పశు ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. 343 జీవాలకు వైద్య సేవలందించారు. కన్నూరుపాలెం పశు వైద్యాధికారి దయానా పది పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సలు, 53 పశువులకు, 280 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులను తాపించారు.

రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి



బయ్యవరంలో సాగర్ సిమెంట్ కార్మికుల ర్యాలీ

కశింకోట: ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని సీఐ అల్లు స్వామినాయుడు కోరారు. మండలంలోని బయ్యవరంలో సాగర్ సిమెంట్ పరిశ్రమ ఉద్యోగులు, సిబ్బంది గురువారం రోడ్డు భద్రత వారోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రతి ద్విచక్ర వాహనదారు హెల్మెట్ ధరించాలని, కారులో సీట్ బెల్టు పెట్టుకోవాలన్నారు. ఎస్ఐలు కె. లక్ష్మణరావు, పి. మనోజ్‌కుమార్, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.